# అణచివేస్తామంటే తిరగబడుతాం

- ప్రభుత్వ తీరును ఎండగడుతాం
- అక్రమ అరెస్టులు అన్యాయం
- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

బీఆర్ఎస్ నాయకులు సామ సుందర్ రెడ్డి, భూమేశ్వర్ తదితరులను అరెస్ట్ చేసిన పోలీసులు

ఎల్బీనగర్, డిసెంబర్ 6: పోలీసులతో బీఆర్ఎస్ పార్టీని, క్యాడర్‌ను అణిచివేస్తామంటే అది ప్రభుత్వ మూర్ఖత్వమేనని, ఎంత అణిచివేసేందుకు చూస్తే తమ కార్యకర్తలు మరింత తిరుగబడతారని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హెచ్చరించారు. బీఆర్ఎస్ భవన్‌కు ఉదయం 5 గంటలకే చేరుకున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పోలీసుల తీరుపై , ప్రభుత్వ వైఖరిపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు బీఆర్ఎస్ నాయకులను అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపేందుకు వెళ్లకుండా హౌజ్ అరెస్టులు చేయడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఉదయమే బీఆర్ఎస్ భవన్‌కు రావడంతో ఇంటి వద్ద అరెస్టు కాలేదని, తమ ఇంటికి కూడా పోలీసులు వచ్చి వెళ్లారని అన్నారు. మాజీ మంత్రులు హరీశ్‌రావును, జగదీశ్‌రెడ్డిని, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిలను గంటల తరబడి పోలీస్ స్టేషన్‌లలో పెట్టడం, నాలుగు వందల మంది పోలీసులను చుట్టూ పెట్టడం శోచనీయమన్నారు. కౌశిక్‌రెడ్డి ఒక ఫిర్యాదు చేయాలని చూస్తే అది తీసుకోకుండా తిరస్కరించి ఈ విధంగా డ్రామా చేయడం దురదృష్టకరమని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యేలను ఎందుకు అరెస్టులు చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులను భయభ్రాంతులకు గురి చేసి పార్టీ క్యాడర్‌ను చెల్లా చెదురు చేయాలని, నాయకత్వాన్ని నిర్వీర్యం చేయాలని ప్రయత్నాలు చేస్తూన్నారని , అయితే ఇది బెడిసి కొడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత చేస్తే అంత బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు రెచ్చి పోతారన్నారు. తమ నాయకుడు కేసీఆర్ బయటకు వస్తే తూఫాన్ వస్తుందన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలపై అసెంబ్లీ సమావేశాల్లో ఎండగడతామని, అయితే అసెంబ్లీ సమావేశాల్లో తమను నిలదీస్తారనే భయంతోనే మాజీ మంత్రులపై ప్రధాన బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెడుతూ కాంగ్రెస్ ఎత్తుగడలు వేస్తోందని విమర్శించారు.

### హామీలను ప్రశ్నిస్తే..అక్రమ అరెస్టులా ?

సైదాబాద్: బీఆర్ఎస్ పార్టీ నాయకుల అక్రమ అరెస్టులకు నిరసనగా శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల ఆందోళనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా యాకుత్‌పురా, మలక్‌పేట నియోజకవర్గంలోని ముఖ్య నాయకులను సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం ఉదయం 5 గంటలకు సైదాబాద్ పోలీసుల నాయకుల ఇండ్ల వద్దకు వెళ్లి నిద్రలో ఉన్న నాయకులను బలవంతంగా అరెస్ట్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ పార్టీ యాకుత్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జి సామ సుందర్ రెడ్డి, హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కొరుడు భూమేశ్వర్, ఐఎస్ సదన్, సైదాబాద్ డివిజన్ల బీఆర్ఎస్ అధ్యక్షులు మెట్టు భాస్కర్ రెడ్డి, పగిళ్ల శ్రీనివాస్ రెడ్డిలను ఉదయమే అరెస్ట్ చేసిన పోలీసులు సాయంత్రం వరకు నాయకులను పోలీస్ స్టేషన్‌లోనే నిర్బంధించి వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. నాయకులను అరెస్టును నిరసిస్తూ పలువురు బీఆర్ఎస్ నాయకులు వారికి మద్దతుగా డివిజన్ మాజీ అధ్యక్షుడు కావేటి ధర్మరాజు, నర్సింగ్‌రావు, గాజుల శివకుమార్, కార్తీక్, హరినాథ్,పొదిళ్ల శ్రీధర్ తదితరులు పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చి తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

### ప్రజలకు దూరమైన కాంగ్రెస్ పాలన..

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తుంటే అసహనానికి గురై బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేస్తున్నారని సామ సుందర్ రెడ్డి, కొరుడు భూమేశ్వర్ అన్నారు. రేవంత్ రెడ్డి చర్యలను ప్రజలు తిప్పికొడుతారన్నారు. రేవంత్ సర్కార్ పాలన తిరోగమన దిశలో కొనసాగుతుందని, సంక్షేమ పథకాలను రద్దు చేస్తూ రోజుకో అనాలోచిత ప్రకటనలు చేస్తుందని ఆరోపించారు. దేశ రాజకీయాల్లో ఏడాదిలోపు ప్రజా వ్యతిరేకత మూటగట్టుకోవటంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చరిత్ర సృష్టించిదన్నారు. నిర్బంధంలో నుంచే బీఆర్ఎస్ పార్టీ పుట్టిందని, ఎంతమంది నాయకులను, కార్యకర్తలను, అభిమానులను అరెస్ట్‌చేసిన భయపడేదిలేదని, ఎలాంటి చర్యలనైనా ఎదుర్కొంటామని, త్వరలోనే అధికారంలోకి రావటం ఖాయమన్నారు.

## అధికారుల తీరును నిరసిస్తూ కార్పొరేటర్ దీక్ష


మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న కార్పొరేటర్ విజయ లక్ష్మి

బడంగ్‌పేట, డిసెంబర్6: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే అధికారులు పట్టించు కోవడం లేదని 31వ డివిజన్ కార్పొరేటర్ విజయ లక్ష్మి రాజు ఆరోపించారు. డివిజన్ పరిధిలో ఉన్న జనప్రియ మహానగర్‌లో సెల్లార్ నిర్మాణాలు చేస్తున్నారని అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా పట్టించు కోక పోవడంతో ఆమె శుక్రవారం మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేశారు. పార్కింగ్ స్థలాలు ఆక్రమణకు గురవుతుంటే అధికారులు పట్టించు కోక పోవడం వల్లనే నిరసన దీక్షకు దిగినట్లు పేర్కొన్నారు. పార్కింగ్ స్థలాలు కబ్జా చేస్తే నివాసముంటున్న ప్రజలు వాహనాలు ఎక్కడ పెట్టుకోవాలన్నారు. పార్కింగ్ స్థలాలను పరిరక్షించే వరకు దీక్ష కొనసాగిస్తానని తెలిపారు. ప్లకార్డు పట్టుకొని కార్యాలయం ఎదుట కూర్చున్నారు. దీంతో కమిషనర్ జ్ఞానేశ్వర్ ఆదేశాల మేరకు జేసీబీ సహాయంతో అధికారులు పార్కింగ్ స్థలాలలో వెలసిన నిర్మాణాలను తొలగించారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చాలా చోట్ల ఇదే పరిస్థితి ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఎట్టకేలకు ఆక్రమణలను తొలగించిన అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## తొక్కిసలాటలో మహిళ మృతిపై ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు

హైదరాబాద్,డిసెంబర్ 6(నమస్తే తెలంగాణ): అల్లు అర్జున్ చిత్రం పుష్ప2 ప్రీమియర్ షో ప్రదర్శన సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై న్యాయవాది వొద్యారపు రవికుమార్ జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అల్లు అర్జున్ ముందస్తు ఏర్పాట్లు చేసుకోకుండా వెళ్లడంతోనే ఈ ఘటన జరిగిందని అతడిపై క్రిమినల్ కేసు నమోదు చేసి మృతురాలి కుటుంబానికి రూ. 5 కోట్ల పరిహారం అందించాలని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని రవికుమార్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

## టీచర్స్ కాలనీ పార్కును అభివృద్ధి చేస్తా

పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, డిసెంబర్ 6 : బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ టీచర్స్ కాలనీ ఫేజ్1లో ఉన్న 6వేల గజాల స్థలంలో పార్కును అభివృద్ధి చేస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కాలనీ సంక్షేమ సంఘాల నాయకులతో కలిసి పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం అన్ని హంగులతో పార్కును నిర్మించనున్నట్లు తెలిపారు. వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, అందమైన పూల మొక్కలతో సుందరీకరణ లాంటివి చేపడుతామన్నారు. కొన్ని సంవత్సరాలుగా ఈ స్థలం కోర్టు వివాదంలో ఉండటం వలన అభివృద్ధి సాధ్యం కాలేదన్నారు. ఇప్పుడు కోర్టు నుంచి తుది తీర్పు వచ్చినందున అభివృద్ధి చేస్తున్నామన్నారు. త్వరలోనే పనులను ప్రారంభించి, పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బీఆర్ఎస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవిందర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, సామ బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

## ఫోర్త్ సిటీ రోడ్డుకు భూములు ఇవ్వొద్దు

ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కందుకూరు, డిసెంబర్ 6 : రాష్ట్ర ప్రభుత్వం మెండిగా వ్యవహరిస్తూ, రైతుల భూములను లాక్కోవాలని చూస్తుందని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. రైతులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని రాచులూరులో ఫోర్త్ సిటీ రోడ్డు ఏర్పాటుకు భూములు కోల్పోతున్న రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఆయనకు గోడు వెళ్లబోసుకున్నారు. ప్రభుత్వం మెండిగా వ్యవహరిస్తూ ఎకరం, రెండు ఎకరాలు ఉన్న రైతుల భూములను గుంజుకుంటుందని తెలిపారు. అనంతరం ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 80 శాతం మంది రైతులు ఒప్పుకుంటే భూములను తీసుకోవాలని అన్నారు. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని తెలిపారు. పేద రైతుల భూములను లాక్కోని పొట్టకొట్టవద్దని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులు భూములు ఇవ్వొదని కోరారు. రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రత్నం, జిల్లా బీజేపీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కార్పొరేషన్‌లో వస్తువులకు భద్రత కరువు

- గతంలో ట్రాక్టర్.. ఇప్పుడు టీవీ మాయం
- ఆందోళనలో అధికారులు

బడంగ్‌పేట, డిసెంబర్ 6: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్న టెలీకాన్ఫరెన్స్ టీవీ మాయమైనట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో పాత మున్సిపల్ కార్యాలయంలో ఉన్న వస్తువులను కొత్త మున్సిపల్ కార్పొరేషన్‌కు షిఫ్ట్ చేసేటప్పుడు టెలీకాన్ఫరెన్స్ టీవీ తీసుకొచ్చిన్నట్లు గతంలో పనిచేసిన మేనేజర్ నాగేశ్ పేర్కొంటున్నారు. టీవీని మొదటి అంతస్తులో అమర్చాలని కంప్యూటర్ ఆపరేటర్ సుదర్శన్‌కు చెప్పినట్లు ఆయన తెలిపారు. సుదర్శన్ మాత్రం టీవీ పైన పెట్టించారో ఏమో నాకు తెలియదని అంటున్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన వస్తువులను పెట్టడానికి ఒక స్టోర్ రూమ్ ఏర్పాటు చేశారు. అయితే స్టోర్ రూమ్‌కు ఒక స్టోర్ కీపర్ బాధ్యతలు ఒక వ్యక్తికి ఇచ్చినట్లు చెబుతున్నారు. ఎవరు ఆ స్టోర్ కీపర్ అన్న చర్చ జరుగుతుంది. స్టోర్ కీపర్‌కు తెలియ కుండా టీవీ ఏమైందని ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఇటీవల పై అధికారులు నిర్వహించే టెలీకాన్ఫరెన్స్ సమావేశాలకు జరిగినప్పుడలా వేరే చోటుకు పోతున్నారు. అయితే కార్యాలయంలో ఉన్న టీవీ ఏమైందని చర్చ రావడంతో టీవీని వెతకడం మొదలు పెట్టారు. చివరకు టీవీ కన్పిస్తలేదని ఓ నిర్ధారణకు వచ్చారు. టీవీ గురించి చర్చించి విషయం బయటకు పొక్క కుండా జాగ్రత్త పడుతున్నారు. గతంలో ట్రాక్టర్లకు అమర్చిన బ్యాటరీలు పోయాయి. మోటర్లకు బిగించిన విద్యుత్ వైర్లు, చివరకు ట్రాక్టర్ కూడా మాయమైన ఘటనలు ఉన్నాయి. మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేయగా సంవత్సరం తర్వాత ట్రాక్టర్ ను పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. ఇలా అనేక సంఘటనలు ఉన్నాయి. టీవీ ఎవరికి తెలియదంటే కార్యాలయంలో ఉన్న వారికి ఎవరికి తెలియక పోతే ఏమైనట్లు? మున్సిపల్ కార్పొరేషన్ లో వస్తువులకు బాధ్యులు ఎవరు అని చర్చించుకుంటున్నారు.

### స్టోర్ కీపర్ ఏం చేస్తున్నట్టు ?

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వస్తువుల భద్రత కరువైందన్న చర్చ జరుగుతోంది. వస్తువులు పోవడం ఏమో గాని ట్రాక్టర్లు, టీవీలు మాయం కావడంతో గందరగోళం నెలకొన్నది. ఇటీవల కాలంలో ప్రైవేట్ సెక్యూరిటీని పెట్టారు. అయినా కూడా వస్తువులు పోతున్నాయంటే కారణం ఏమిటన్న సందేహాలు వస్తున్నాయి. స్టోర్ కీపర్‌గా ఉన్న వాళ్లు ఏం చేస్తున్నట్లు అన్న అనుమానాలు వస్తున్నాయి. సెక్యూరిటీ ఉన్నా ట్రాక్టర్ బ్యాటరీలు పోవడంపై అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు.

## ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

ఆర్కేపురం, డిసెంబర్ 6 : రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని షైన్‌వేవ్ చారిటబుల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ముస్తఫా అన్నారు. శుక్రవారం కేఎల్-హైటెక్ సెక్యూర్ ప్రింట్ లిమిటెడ్ కంపెనీలో షైన్‌వేవ్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.ముస్తఫా మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలని సూచించారు. ప్రతి రోజు ఎంతో మంది రోడ్డు ప్రమాదాలకు గురై సరైన సమయంలో రక్తం దొరకక చనిపోతున్నారని అలాంటి వారికి ఇలా రక్తదాన శిబిరం ద్వారా సేకరించిన రక్తం ఎంతోగాను ఉపయోగపడుతుందన్నారు. ప్రతినిధి విజయ పాల్గొన్నారు.

సైదాబాద్ కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్

హయత్‌నగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, వివిధ సంఘాల నాయకులు

మూసారాంబాగ్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న మాదిగ రాజకీయ పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రభాకర్

జిల్లెలగూడలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి

## మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం

ఎంఈవోకు వినతి పత్రం అందజేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు

కందుకూరు, డిసెంబర్ 6 : తాము చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలని సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు కోరారు. శుక్రవారం మండల విద్యాధికారి నరసింహకు వినతి పత్రం అందజేసిన అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 10న నిరవధిక సమ్మెను నిర్వహించనున్నట్లు తెలిపారు. గత 15సంవత్సరాల నుంచి వివిధ హోదాల్లో మండల విద్యావనరులు కేంద్రంతో పాటు కస్తూర్బా భవిత కేంద్రాల్లో విధులను నిర్వహిస్తున్నామని ప్రభుత్వం తమను గుర్తించడం లేదని వాపోయారు. చాలీచాలనీ జీతాలతో కాలం వెళ్లదీస్తున్నామని, దీంతో తమ కుంటుంబాలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తమ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి మాటతప్పిందని తెలిపారు. రెగ్యులర్ చేసే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు విజయలక్ష్మి, లావణ్య, భవానీ, వెంకటేశ్, సురేశ్, సత్తయ్య, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని ఎల్బీనగర్, మహేశ్వరం, మలక్‌పేట నియోజకవర్గ పరిధిలో పలు కూడళ్ల వద్ద ఆయన విగ్రహానికి, చిత్రపటాలకు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. భారత దేశానికి అతి పెద్ద రాజ్యాంగాన్ని అందించి దేశ ప్రజా స్వామ్య స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచారని కొనియాడారు. కుల రహిత సమాజ నిర్మాణం కోసం జీవితాంతం పోరాడిన మహా నాయకుడు అని గుర్తుచేశారు.
-జోన్ బృందం

లింగోజిగూడ డివిజన్‌లో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్,తదితరులు

బాలాపూర్ చైరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి

హస్తినాపురంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నేతలు

ఎల్బీనగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి

కర్మన్‌ఘాట్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చంపాపేటలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కొత్తపేటలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్ యువ చైతన్య యువజన సంఘం ప్రతినిధులు

అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న మురుకుంట్ల అరవింద్‌శర్మ, తదితరులు


కందుకూరులో నివాళులర్పిస్తున్న మాజీ జడ్పీటీసీ పెద్ద రామయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు కంద పెద్ద నర్సింహ,కృష్ణ

## రేవంత్ పిచ్చి మాటలతో రాష్ట్రం ఆగం

మలక్‌పేట, డిసెంబర్ 6: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి అభివృద్ధిని పక్కన బెట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గత పాలకులపై ప్రతీకారం తీర్చుకునే ధోరణిలో నిత్యం ఆరోపణలు చేస్తూ కాలాయాపన చేస్తున్నారని బీజేపీ భాగ్యనగర జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి ఆరోపించారు. సాధ్యం కానీ ఆరు హామీలు ఇచ్చి అడ్డదారిలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, వాటిని అమలు పరచకుండా ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మలక్‌పేట నియోజకవర్గ నాయకులు సైదాబాద్ హనుమాన్ టెంపుల్ మెయిన్ రోడ్డునుంచి సలీంనగర్ చౌరస్తా వరకు బైక్‌లతో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సలీంనగర్ చౌరస్తా వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ అమలుకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి కుడిదిలో పడ్డ ఎలుకలా మారిన కాంగ్రెస్ నాయకులు, ప్రజల దృష్టిని మళ్లించేందుకు అడ్డదారులు తొక్కుతున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై సరైన అవగాహన లేని రేవంత్‌రెడ్డి తన పిచ్చి మాటలతో, దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా ఉన్న తెలంగాణను చివరికి చేర్చారని ఆరోపించారు. కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా కోశాధికారి తుమ్మలపల్లి రమేశ్‌రెడ్డి, మూసారాంబాగ్, సైదాబాద్ డివిజన్ల కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మి, అరుణ, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ, కొత్తకాపు రవీందర్‌రెడ్డి, బొక్క మధుసూదన్‌రెడ్డి, దేవేందర్, వంజరి వినోద్ కుమార్, హరిగౌడ్, భరత్ పాల్గొన్నారు.

## హత్య కేసులో ఆసిఫ్‌కు జీవిత ఖైదు

రంగారెడ్డి జిల్లా కోర్టులు,డిసెంబర్6: పాత వివాదాలను మనసులో పెట్టుకుని పెట్రోల్ పోసి హత్య చేసిన వ్యక్తి మహ్మద్ ఆసిఫ్‌కు జీవితఖైదు, ఐదు వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి 8వ అదనపు జిల్లా న్యాయమూర్తి సతీశ్‌కుమార్ శుక్రవారం తీర్పునిచ్చారు. అదనపు పీపీఎం గంగారెడ్డి కథనం ప్రకారం..కందుకూరు మండలం నెదునూర్ గ్రామానికి చెందిన మహ్మద్ ఇమ్రాన్ ఇంటి దగ్గర ఉండే ఆసిఫ్ కుటుంబానికి మధ్య చిన్న వివాదం తలెత్తడంతో ఇమ్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కోపంతో పెంచుకున్న ఆసిఫ్ 2018 ఏప్రిల్ 9న ఇమ్రాన్‌పై పెట్రోల్ పోసి తగులబెట్టాడు. చికిత్స పొందుతూ ఇమ్రాన్(19) మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యులు కందుకూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడితో పాటు అతడికి సహకరించిన మరో నలుగురిపై విచారణ జరిపి చార్జిషీట్ దాఖలు చేయగా సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం ఆసిఫ్‌కు జీవితఖైదు శిక్ష విధించింది.